జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
ఆదివారం | 12 | జులై | 2026 ◆ పేజీలు : 6



## పల్మోకాన్–2026లో డా. వరికూటి సుబ్బారావుకు గోల్డ్ మెడల్




**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** తెలంగాణ పల్మోకాన్–2026లో ఖమ్మం జిల్లా క్షయ నియంత్రణ అధికారిగా పని చేసిన (డీటీసీవో) డా. వరికూటి సుబ్బారావు ప్రతిభ కనబరిచారు. 'డిఫరెన్షియేటెడ్ టీబీ కేర్ మోడల్' అంశంపై ఆయన చేసిన శాస్త్రీయ ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మకమైన 'డా. కన్వల్‌చందర్ ఒరేషన్ గోల్డ్ మెడల్' అవార్డును ఆయన అందుకున్నారు. క్షయవ్యాధి నియంత్రణలో వినూత్న విధానాలు అమలు చేయడంతో పాటు శాస్త్రీయ పరిశోధనలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి.డా. వరికూటి సుబ్బారావు అంతకు ముందు కూడా రాష్ట్రస్థాయిలో,జాతీయస్థాయిలో క్షయ వ్యాధి నియంత్రణలో ఖమ్మం జిల్లాలో చేసిన కృషికి అనేక గోల్డ్ మెడల్స్ లభించాయి. గోల్డ్ మెడల్ సాధించిన ఈ ఘనత ఖమ్మం జిల్లాకు గర్వకారణమని వైద్యులు,ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బంది అభినందించారు.




- శ్రీలంక ప్రభుత్వం నుండి ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్న డాక్టర్ లక్ష్మి ఆకుల
- ఆటిజంతో బాధపడుతున్న పిల్లల కోసం 'బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్' ద్వారా అసాధారణ సేవలందిస్తున్న డాక్టర్ లక్ష్మి ఆకుల.
- తల్లిదండ్రుల్లో మనోధైర్యం నింపుతూ, పిల్లలను సాధారణ స్థితికి తెచ్చేందుకు
- ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు.
- దాతలు సహకరిస్తే అత్యాధునిక పరిజ్ఞానంతో గ్రామగ్రామానికీ బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్ సేవలను విస్తరిస్తామని వెల్లడి.

6 లో..

# ఆటిజం సేవల్లో అంతర్జాతీయ గుర్తింపు

## భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి




- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వేనే కీలకం
- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయాలి
- రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 60 చెల్లింపు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీని వేగవంతం చేయాలి
- ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందించాలి
- భూ రీ-సర్వే, ఇందిరమ్మ ఇండ్లు,సాదా బైనామా దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి

2 లో...

## విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి
- విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి
- స్వామి బోధమయానంద మహారాజ్



**సత్తుపల్లి జూలై11(ప్రజా జ్యోతి)** విద్యార్థులకు మార్కులతో పాటు క్రమశిక్షణ, నైతిక, మానవీయ విలువలను పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని, హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మహారాజ్ అన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తమ బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.శనివారం సత్తుపల్లిలోని మాదురి ఫంక్షన్ హాల్‌లో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సౌజన్యంతో నిర్వహించిన ఉపాధ్యాయ వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో

మిగతా 2 లో...

## బాణాపురానికి బలమైన భరోసా
# బాణా డెవలప్‌మెంట్ ఫౌండేషన్

- గ్రామాభివృద్ధికి ఆవుల భాస్కర్ రెడ్డి సేవలు ఆదర్శం
- విద్య, వైద్యం, తాగు నీరు.. పేదల కోసం నిరంతర సేవలు
- బాణాపురంలో 105 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు అందజేత
- స్కాలర్‌షిప్‌లతో విద్యార్థులకు అండగా నిలిచిన ఫౌండేషన్




**ముదిగొండ జులై 11(ప్రజాజ్యోతి )** ఒక వ్యక్తి సంకల్పం ఒక ఫౌండేషన్ సేవా దృక్పథం.. ఒక గ్రామ రూపురేఖలను ఎలా మార్చగలదో

మిగతా 2 లో...

## విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు





(మొదటి పేజీ తరువాయి...)

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఆదర్శ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర అత్యంత కీలకమని, ఒక గొప్ప లక్ష్య సాధన కోసం ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల భవిష్యత్తు రూపుదిద్దుకునేది పార్లమెంటులో కాదు, పాఠశాలలో అని పేర్కొన్నారు.మైసూర్ రామకృష్ణ మిషన్ స్వామీజీ మహా మేధానంద, రామకృష్ణ మిషన్ విజయవాడ ఉప కార్యదర్శి స్వామిజీ శితి కంటానంద మహారాజ్ మాట్లాడుతూ, విద్యార్థులకు మార్కులతో పాటు మానవతా విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాభావాన్ని అలవర్చే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి ఒక తపస్సు లాంటిది. దానిని ప్రేమించాలి. విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా భావించాలని సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద మాట్లాడుతూ,గురువును గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించడమేనని అన్నారు. నిరంతరం నేర్చుకుంటూ, ప్రేమతో బోధిస్తూ, సమయపాలన పాటిస్తూ, ప్రతి విద్యార్థిని సొంత బిడ్డగా భావించి వారి విజయంలో తన విజయాన్ని చూసే వారే నిజమైన ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకులను అన్నారు. అనంతరం ఎంఈఓ రాజేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాల విద్యార్థులు హాజరై ఆటపాటలతో అలరించారు. స్వామీజీలు అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్,విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు,2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ,పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్నిజిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు.ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి,హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, తిరస్కరణ లకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు.తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు తెలిపారు.రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని,కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది,పరికరాలు, మౌళిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువిచ్చి,గడువులోగా చేరని వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. లైసెన్స్ సర్వేయర్లకు బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరిత గతిన జారీ చేయాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండవ విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలని, రెండవ విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి-2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని,పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు,గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు.టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు.ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో భూ రీ-సర్వే చేపట్టామని, నాలుగు యంత్రాలను సీఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. గ్రామాల మధ్య సరిహద్దు సమస్యలపై ప్రత్యేక సమన్వయంతో ముందుకు సాగుతున్నామని, భూ రీ-సర్వేపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సర్వే అనంతరం నోటీసులు జారీ చేస్తుండగా ఇప్పటివరకు కుటుంబ వివాదాలు మినహా పెద్దగా అభ్యంతరాలు రాలేదన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్.శ్రీనివాస్,తహసీల్దార్లు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# బాణాపురానికి బలమైన భరోసా బాణా డెవలప్‌మెంట్ ఫౌండేషన్

**(మొదటి పేజీ తరువాయి...)**

చెప్పాలంటే ముదిగొండ మండలం బాణాపురంలోని బాణా డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ను ఉదాహరణగా చెప్పొచ్చు. గ్రామంలో పుట్టి, అదే గ్రామం అభివృద్ధే తన బాధ్యతగా భావించిన రిటైర్డ్ ఐఆర్ఎస్ ఆవుల భాస్కర్ రెడ్డి గత పదేళ్లుగా చేస్తున్న సేవలు బాణాపురానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. పేదల కష్టాలను దగ్గర నుంచి తెలుసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా చేపట్టిన ప్రతి కార్యక్రమం గ్రామ ప్రజల మన్ననలు పొందుతోంది. 2016 జూన్ 1న అపోలో టెలీహెల్త్ సేవలతో ప్రారంభమైన బాణా డెవలప్మెంట్ ఫౌండేషన్, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అనంతరం గ్రామ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. 2021లో గ్రామంలోని పేద ప్రజలకు ఉపయోగపడేలా కళావేదికను నిర్మించి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, షెడ్లు తదితర మౌలిక వసతులను కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని సృష్టించింది. 2016లో గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని గ్రామ ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. దీంతో గ్రామస్థులకు నాణ్యమైన తాగునీటి సౌకర్యం కల్పించబడింది. విద్యార్థులను ప్రోత్సహించడంలో కూడా బాణా ఫౌండేషన్ ముందంజలో ఉంది. తన తండ్రి అయిన అవుల అమ్మిరెడ్డి పేరు పైన 2020 నుంచి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందిస్తోంది. ఇప్పటివరకు సుమారు 390 మంది విద్యార్థులకు రూ.42.74 లక్షలు స్వచ్ఛందంగా అందజేస్తుంది. అదేవిధంగా ఈ శనివారం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 105 మంది విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున స్కాలర్‌షిప్ లు అందజేయనున్నారు. తల్లితండ్రులు లేని పిల్లలకు ప్రతి నెల 2000/– రూపాయల చొప్పున అయిదు సంవత్సరాల నుండి ఇవ్వటమే కాకుండా స్కాలర్‌షిప్ ఫౌండేషన్ ద్వారా పదో తరగతి తర్వాత ఇంటర్, డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థులకు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి ఉన్నత విద్యకు అండగా నిలుస్తోంది. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, సేవాభావంతో ముందుకు సాగుతున్న ఆవుల భాస్కర్ రెడ్డిని గ్రామస్థులు అభినందిస్తున్నారు. గ్రామంలో ఇటువంటి సేవా దృక్పథం కలిగిన వ్యక్తి ఉండటం తమ అదృష్టమని వారు పేర్కొంటున్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఆలోచనతో ప్రజలకు మార్గనిర్దేశం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించేందుకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయం అని గ్రామ పెద్దలు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. "గ్రామంలో పుట్టి... గ్రామానికే సేవ చేయడం" అనే లక్ష్యంతో బానా డెవలప్మెంట్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలు బాణాపురాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతు ఆశీర్వాద సభతో రైతులకు ఒరిగిందేమీ లేదు

- బీఆర్ఎస్ నాయకులు
- సీఎం సభను ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా కాంగ్రెస్ పార్టీ సభలా నిర్వహించారు
- ప్రభుత్వ ధనాన్ని రాజకీయ విమర్శలకే వినియోగించారు
- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌పై వ్యక్తిగత విమర్శలే ప్రధాన అజెండా
- సభ అట్టర్ ఫ్లాప్.. రైతుల స్పందనతో కాంగ్రెస్ నాయకులు నిరాశలో
- సభ కోసం భూములు ఇచ్చిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలి



**చింతకాని జులై 11 ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ రైతుల సమస్యల పరిష్కారానికి కాకుండా టిఆర్ఎస్ పార్టీ నాయకుల పై విమర్శలు చేయడానికే పరిమితమైందని ఆరోపించారు. మండలంలో నిర్వహించిన సభ ద్వారా రూ.2 లక్షలలోపు పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన వస్తుందని, రెండుసార్లు ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులు ఇస్తారని,కెసిఆర్ చింతకాని మండలం పైలెట్ ప్రాజెక్టు కింద దళిత బంధు కింద ఇచ్చిన 10 లక్షలు, అర్హులై ఉండి రాని మా దళిత బిడ్డలకు దళిత బందు ఏమైనా ఇస్తారో అని ఎదురు చూశాము.మహిళలకు గృహలక్ష్మి పథకం రూ.2,500 కింద ఇస్తానన్న ఆర్థిక సాయం వంటి ఎన్నికల హామీల అమలుపై సీఎం మాట్లాడతారని మహిళలు,రైతులు ఆశించారని తెలిపారు. అయితే వాటిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా సభ మొత్తం రాజకీయ విమర్శలకే పరిమితమైందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా కాకుండా స్థానిక నాయకుడిలా వ్యవహరించారని,రేవంత్ రెడ్డి అధికార అహంకారంతో చావు నోట్లో తలకాయ పెట్టి ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న కెసిఆర్ పై కారు కూతలు కూయడం తప్ప ఏమీ చేతకాని సీఎం,.కేటీఆర్, హరీష్‌రావు పై అవగాహన లేని మాటలు అసత్య మాటలు మాట్లాడడం తప్ప మరేమీ లేదు, పువ్వాడ అజయ్ కుమార్ పై వ్యక్తిగత దూషణకు చేయడం నీ దిగజారుడుతనం మాటలుగా ప్రజల గమనిస్తున్నారు, పువ్వాడ అజయ్ కుమార్ జిల్లాలో ఒక్కడే మంత్రిగా ఉండి ఖమ్మం జిల్లా ను ఎలా అభివృద్ధి చేశారో ప్రతి ఒక్కరికి తెలుసు,ముగ్గురు మంత్రులు ఉండి దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా ప్రజలకు ఏం చేసింది లేదంటూ ప్రజలు బహిరంగనే మాట్లాడుతున్నారు, ప్రభుత్వ నిధులతో నిర్వహించిన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగత రాజకీయ వేదికగా మార్చారని అన్నారు.రైతు ఆశీర్వాద సభకు బస్సులు పెట్టి బలవంతంగా తరలించాలని అధికారులకు ఆదేశించినప్పటికీ, ఒక్కొక్క బస్సుకి కేవలం ఐదు ఆరుగురు మాత్రమే రావడంతో రైతులు సభకు రావడానికి విముఖత వ్యక్తం చేశారు, బట్టి విక్రమార్క మూడున్నర లక్షలు మంది సభకు వస్తారని చెప్పగా ఆశించిన స్థాయిలో మహిళలు, రైతులు స్పందించలేదని పేర్కొన్నారు.అంచనాలకు చాలా తక్కువగా ఉండటం సభపై రైతుల అభిప్రాయాన్ని స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు.ఇన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ రైతుల ఆశీర్వాదాన్ని పొందలేదని, సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో కాంగ్రెస్ నాయకులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. జగన్నాధపురం, మత్కేపల్లి రైతులు సభ కోసం భూములను ఇచ్చిన రైతులకు ఇప్పటికైనా ప్రభుత్వం ఇస్తానన్న పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు బొడ్డు వెంకట రామారావు,మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు ,మాజీ ఎంపీపీ పోనుగోటి రత్నాకర్ లచ్చగూడెం ఉప సర్పంచ్ పొట్ల సీతయ్య కొదమూరు ఉప సర్పంచ్ చిట్టిమోదు రాంబాబు, కోదుమూరు బిఎల్ఎ రేగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- వర్షాకాలంలో డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నేపథ్యంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు,ఉపాధ్యాయులు మరియు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, జనాభా నియంత్రణ, తల్లి–శిశు ఆరోగ్యం,సమతుల్య కుటుంబ వ్యవస్థ, బాలికల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని, దీనివల్ల నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం,ఎదుగుదలలో ఆటంకాలు వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు.వర్షాకాలం ప్రారంభమైనందున దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు.ముఖ్యంగా డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను తరచూ శుభ్రపరచాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత,పరిశుభ్రత,తాగునీటి సదుపాయాలు, వంట పాత్రల శుభ్రత, ఆహార నిల్వ విధానాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా హెచ్‌పీవీ టీకా యొక్క ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ డి.రామారావు,అర్హులైన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని, ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తమ కుమార్తెలకు టీకా వేయించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం,చేతులను సబ్బుతో తరచుగా కడుక్కోవడం,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి,పి హెచ్ సి ఎం వి పాలెం నుండి హెచ్ఈఓ బద్రు ఆశాలు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమంలో ఇంటింటి సర్వే

- నిర్వహించిన ముత్తారం బీఆర్ఎస్ నాయకులు



**ముదిగొండ జులై 11(ప్రజాజ్యోతి )**ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలో కొనసాగుతున్న సర్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీఎల్ఏలు నారాపొంగు కిరణ్, తాళ్ల రమేష్ ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, అవసరమైన చోట ఓటర్ పత్రాలను నింపించారు.ఈ సందర్భంగా ఓటర్లకు నమోదు ప్రక్రియ, వివరాల సవరణ, అవసరమైన పత్రాల గురించి అవగాహన కల్పించారు.ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు మూల శ్రీనివాస్,అమరగాని రామరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ వైస్ ఎంపీపీ గురజాలను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**చింతకాని, జూలై 11 ప్రజాజ్యోతి :** మండల సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు ఇటీవల కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.బీఆర్ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్, మండల నాయకులు బొడ్డు వెంకట రామారావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్ తదితరులు గురజాల హనుమంతరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా,పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేరెంట్స్ కమిటీ పాఠశాల అభివృద్ధికి మార్గదర్శక శక్తి

- ఎర్రుపాలెం గురుకుల ప్రిన్సిపాల్ పరమేశ్వరి





**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం గురుకుల పాఠశాలలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయని పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వి.పరమేశ్వరి తెలిపారు. యాజమాన్యం నిబంధనలకు అనుగుణంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో కమిటీ చైర్మన్‌గా ఇనగాలికి చెందిన పొట్టపింజర చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా జమలాపురానికి చెందిన ముల్లంగి పూర్ణిమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సగ్గుర్తి ముత్యాలరావు, వేల్పుల సుధాకర్, గుడేటి జ్యోతి, ఇనపనూరి కళ్యాణి, ఇనపనూరి ఝాన్సీ, సంగెపు జ్యోతి, సగ్గుర్తి ద్వారక, వెంకటరత్నం, కోట స్వాతి, కొమ్ము ఉదయశ్రీ, తిరుపతమ్మ, కందుకూరి రమ్య, పిల్లలమర్రి స్వాతి, నాగలక్ష్మి , చుక్క జ్యోతి, పులి రాణి, మేరీలు ఎన్నికైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పరమేశ్వరి మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ అనేది కేవలం ఒక కమిటీ మాత్రమే కాదని, పాఠశాల అభివృద్ధికి మార్గదర్శక శక్తిగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను పాఠశాలతో కలిసి పంచుకునే గొప్ప వేదికగా పేరెంట్స్ కమిటీ పనిచేస్తుందని, తల్లిదండ్రుల సహకారమే గురుకుల విజయానికి బలమైన పునాదిగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య స్ఫూర్తి, బాధ్యతాయుతమైన భాగస్వామ్యం, విద్యాభివృద్ధిపై నిబద్ధతకు ప్రతీకగా ఈ ఎన్నికలు నిలిచాయని ఆమె తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా నూతన కమిటీ చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం సమిష్టిగా పనిచేసినప్పుడే గురుకుల విద్య మరింత ఫలవంతమవుతుందని చెప్పారు.నూతనంగా ఎన్నికైన పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యా నాణ్యత పెంపు, క్రమశిక్షణ, నైతిక విలువల పెంపొందింపు, ఆరోగ్యం, సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పాఠశాల ప్రగతికి సంబంధించిన ప్రతి కార్యక్రమంలో బాధ్యతాయుతంగా భాగస్వామ్యం అవుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో జోనల్ అధికారి ఆకస్మికతనిఖీ

- విద్యా ప్రమాణాలు వసతి సౌకర్యాలపై సమీక్ష



**కల్లూరు జూలై 11 ప్రజా జ్యోతి :** కల్లూరు లోనే తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జోనల్ అధికారిని అపర్ణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రత డైట్ మెనూ వసతి సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి చదువుపై ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిల్లల విద్యా వృద్ధిలో తల్లిదండ్రులకు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. మొబైల్ ఫోన్లో ఇతర వ్యసనాలకు పిల్లల దూరంగా ఉండేలా పర్యవేక్షించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మైండ్ స్పార్క్ కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బోధన సిబ్బందితో జరిగిన సమావేశంలో 10వ తరగతి ఇంటర్మీడియట్ లో 100% ఫలితాల సాధనకు కృషి చేయాలని నూతన సాంకేతికతను వినియోగిస్తూ నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. విద్యార్థులలో చదువుతోపాటు పరివర్తన భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు సిబ్బంది ప్రస్తావించిన కోతుల బెడద నివారణకు సోలార్ పెన్సిల్ ఏర్పాటు చేయడం వాష్ రూమ్ సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సందర్శన అనంతరం పాఠశాలలో బోధన పరిశుభ్రత డైట్ మెనూ అమలు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ ప్రిన్సిపాల్ కనకదుర్గ తో పాటు అధ్యాపక బృందాన్ని జోనల్ అధికారిని అభినందించారు.

## వై ఆర్ జి కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- హెచ్ఐవి సోకినవారిపట్ల వివక్షత చూపకుండా గౌరవించాలి
- వై ఆర్ జీ కేర్ సంస్థ సూపర్వైజర్ కర్లకుంట నరేష్




**బోనకల్, జులై 11 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని రావినూతల గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం నందు శనివారం వై ఆర్ జి కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, హెచ్ బి, హెచ్ఐవి రక్త పరీక్షలు చేశారు. రోగులకు ఉచిత మందుల పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి సుఖ వ్యాధులు, టిబి వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వై ఆర్ జీ కేర్ సంస్థ సూపర్వైజర్ కర్లకుంట నరేష్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సంవత్సరానికి ఒకసారి హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. హెచ్ఐవి అనేది అంటువ్యాధి కాదని తెలియపరిచారు. హెచ్ఐవి సోకినవారిపట్ల వివక్షత భావం లేకుండా చూడాలని, వారిని కూడా గౌరవించాలని అన్నారు. ఆర్ట్ మందులు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వై ఆర్ జీ కేర్ సంస్థ సూపర్వైజర్ కర్లకుంట నరేష్, లింకు వర్కర్ కే ప్రభాకర్ రావు, ఏఎన్ఎంలు కృష్ణవేణి, యశోద, ఆశా కార్యకర్తలు కనకదుర్గ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దమ్ముంటే కార్మికుల హక్కులను కాపాడండి కల్వకుంట్ల కవిత

- ఎర్రజెండా కప్పుకున్న ఏఐటిసి యూనియన్ సిగ్గుపడాలి
- హెచ్ఎంఎస్ యూనియన్ తరపున జిఎం ను లేబర్ కోర్టుకు ఈడుస్తాం






**సత్తుపల్లి జూలై11(ప్రజా జ్యోతి )** సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత సత్తుపల్లి జేవియర్ ఓసి లో హెచ్ ఎం ఎస్ యూనియన్ తరపున కార్మికులను కలుసుకునేందుకు, వారి సమస్యలను తెలుసుకునేందుకు జేవియర్ ఓ.సికి శనివారం వచ్చారు. ఆమె రాక సందర్భంగా సింగరేణి గేట్లకు తాళం వేసి,లోపలికి వెళ్లకుండా, పోలీస్ పహారా పెట్టి కాపలా కాసినారు. గేట్లను తోసి వేసుకుంటూ, హెచ్ఎంఎస్ నాయకులు కార్మికులు లోపలికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్తుపల్లి సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, హెచ్ఎంఎస్ యూనియన్ నిజాలు చెప్తుంటే పోలీసులను పెట్టారని,గేటు బద్దలు కొట్టి లోపలికి రావలసిన పరిస్థితి ఏమిటని, కార్మికులను వారి హక్కులను ఎలా కాపాడుకోవాలో తెలుసు అని, దమ్ముంటే కార్మికుల హక్కులను కాపాడాలని, ఎర్రజెండా కప్పుకున్న ఏఐటిసి యూనియన్ సిగ్గుపడాలని, మమ్మల్ని రాకుండా అడ్డుకునేందుకు ఎందుకు భయపడుతున్నారు, సింగరేణి బావిలో దూకి చావండి అని అన్నారు. ఇంత గోరాలు జరుగుతుంటే,గెలిచిన యూనియన్లు ఏమి చేస్తున్నారు అని విమర్శించారు. మార్పు రాకుంటే హెచ్ఎంఎస్ యూనియన్ తరపున జిఎం ను లేబర్ కోర్టుకు ఈడుస్తాం అన్నారు. సత్తుపల్లి హాస్పిటల్ని రెండు బెడ్ల పడకల మీద ఆసుపత్రి నడిపిస్తున్నారని,వెల్ఫేర్ డెవలప్మెంట్ లేదు ఇల్లందు, మణుగూరు పరిస్థితి సత్తుపల్లి కి రాకుండా చేయాలని సూచించారు. సత్తుపల్లిలో కొత్తగా వచ్చే గనులను ప్రైవేటు వాళ్లకు అప్పగించవద్దని,కార్మికుల పక్షాన అడగటానికి వచ్చిన వాళ్లనే నిలవరించే ప్రయత్నం కరెక్ట్ కాదని అన్నారు.హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని అన్నారు. తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం ఎస్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, మాజీ మంత్రివర్యులు బోడ జనార్ధన్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు సారన్న, టిఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్చార్జి గట్టు కరుణ,జిల్లా ప్రధాన కార్యదర్శి వనం నాగేందర్,కిషన్ నాయక్, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి జాగృతి సాగర్, నాయకులు, కార్మికులు ఉన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- శ్రీ సిటీ చైర్మన్ వెంకట్రావు
- మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ





**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళల ఆర్థిక ఎదుగుదల సమాజ ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని శ్రీసిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు తెలిపారు. మాతృశ్రీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు శనివారం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. గతంలోనూ కుట్లు, అల్లికలు నేర్చుకున్న మహిళలకు శ్రీసిటీ చైర్మన్ గా సొంత నిధులతో కుట్టు మిషన్లు అందజేసిన –విషయం విధితమే. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు కేవలం మిషన్ నేర్చుకోవడానికి పరిమితం కాకుండా ఇప్పుడు ఉన్న –అవకాశాలను అందిపుచ్చుకుని వ్యాపారపరమైన ఆలోచనలు చేయాలన్నారు. వివిధ సంస్థల నుంచి ఆర్డర్లు పొంది తద్వారా జీవనోపాధికి మార్గాన్ని ఏర్పరచుకోవాలని వెంకట్రావు సూచించారు. నేడు ఉన్న సమాజంలో మహిళలకు సైతం పలు అవకాశాలు వస్తున్నాయని వాటిని అందిపుచ్చుకున్న వారు ముందు వరుసలో ఉన్నారని ఆయన తెలిపారు. శ్రీసిటీ అనేది రాష్ట్రంలోనే ఒక ల్యాండ్ మార్క్ కానుందని దానికి అందరూ సహకరించాలన్నారు. కేవలం నివాస పరంగానే కాకుండా ఆరోగ్యపరంగా కూడా అన్ని వసతులు ఉన్నటువంటి ప్రాంతంగా తీర్చిదిద్దనున్నామని వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే విద్య పరంగా చేయూతనిచ్చామని రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలతో శ్రీసిటీని –ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజట్రెడ్డి, రమేష్, మాజీ సర్పంచ్ పాండు పాల్గొన్నారు.

## పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం

- సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతి బాట.. పేదలకు అండ!

- ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన
- రూ. 4.38 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి నిరుపేదకూ పారదర్శకంగా అందిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. సుమారు రూ. 4.38 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ సాయాన్ని అందజేశారు.ఖమ్మం రూరల్ మండలం ఆరేకోడు గ్రామంలో రూ. 2.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆరేకోడు తండా నుంచి కాచిరాజు గూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆరేకోడు తండా గ్రామంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిధులతో గ్రామీణుల తాగునీటి అవసరాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఇదే వేదికపై గ్రామానికి చెందిన 20 మంది నిరుపేద నివాస రహితులకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని భరోసా ఇచ్చారు. తిరుమలాయపాలెం మండలం రమణ తండా గ్రామంలో రమణతండా నుంచి ట్యాంక్ బండ్ మీదుగా ములకలపల్లి – తిరుమలాయపాలెం బీటీ రోడ్డు వరకు రూ. 1.94 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న లింక్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని పేర్కొంటూ, మండల పరిధిలోని 19 మంది లబ్ధిదారులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అదేవిధంగా అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 77 మంది లబ్ధిదారులకు రూ. 24.67 లక్షల మొత్తం విలువ కలిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఈ సందర్భంగా మంత్రి పంపిణీ చేశారు. కొక్కిరేణి గ్రామంలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి పనిలోనూ నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిధుల కొరత లేకుండా చూస్తామని, కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.





## సమాజ సేవలో దాతల ఆదర్శం

- పాఠశాలకు విలువైన బహుమతులు
- కృతజ్ఞతలు తెలిపిన ప్రధాన ఉపాధ్యాయురాలు డి స్రవంతి







**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ 9వ డివిజన్ పెద్ద వెంకటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) అభివృద్ధికి పలువురు దాతలు ఉదారంగా విరాళాలు అందించి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమాజంలోని దాతలు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి డి. స్రవంతి అన్నారు.ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ శ్రీ బైరు కోటేశ్వరరావు పాఠశాల వినియోగార్థం ఒక ఐరన్ బీరువాను విరాళంగా అందజేశారు. అలాగే శ్రీ నాగుబంటి మనోహర్ – శ్రీమతి రజనీ దంపతులు తమ కుమార్తె స్వాతి పుట్టినరోజు సందర్భంగా రూ.6,000 విలువైన టేబుల్‌ను పాఠశాలకు అందించి సేవాభావాన్ని చాటుకున్నారు. మరో దాత సముద్రాల వాసుదేవ మూర్తి రూ.5,000 విలువైన రివాల్వింగ్ కుర్చీని పాఠశాలకు బహూకరించారు.దాతలు అందించిన ఈ సామగ్రి పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఉపయోగపడటంతో పాటు విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయురాలు డి. స్రవంతి తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల తరపున దాతలందరికీ ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, విద్యార్థులు దాతలను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలో పిల్లల నమోదు పెంచాలి

- మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య
- ఇన్స్ట్రక్టర్, ఆయాల ఎంపిక జాబితాను అందజేసిన ఎంఈఓ



**బోనకల్, జూలై 11 (ప్రజా జ్యోతి):** మండలంలో ప్రీ ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి ఆరుగురు ఇన్స్ట్రక్టర్లు, ఆరుగురు ఆయాల ఎంపిక జాబితాలను అభ్యర్థులకు శనివారం మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య స్థానిక ఎం ఆర్ సి కార్యాలయంలో అందజేశారు ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ... ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచేలా కృషి చేయాలని, విద్యార్థుల విద్య పట్ల శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ విద్యపై పిల్లల తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలని, విద్యార్థుల మనస్తత్వం తెలుసుకొని విద్యా బోధనలో నైపుణ్యం కల్పించాలని, ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సూచించారు. కాబట్టి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేసి ప్రీ ప్రైమరీ వ్యవస్థను బలోపేతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య కోరారు.

## ఎలుకల మందు తాగిన వ్యక్తిని కాపాడిన 108 సిబ్బంది



**సత్తుపల్లి జూలై11(ప్రజా జ్యోతి)** ఓ వ్యక్తి మద్యానికి బానిసై, కుటుంబ కలహాలతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం, మండల పరిధిలోని కిష్టారం గ్రామానికి చెందిన సానిక పుల్లయ్య ఎలకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించగా ఈఎంటి గొల్లమందల కృష్ణ, వాహన చోదకుడు కట్టం మహేష్ సంఘటన స్థలాన్ని చేరుకొని,ఆక్సిజన్ అందిస్తూ,ఇంజక్షన్లు ఇస్తూ, ధైర్యాన్ని అంది స్తూ,స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చినారు. సత్వర వైద్య సదుపాయం అందించడం ద్వారా, ప్రాణాపాయ స్థితి నుంచి కోరుకున్నాడు.వీరి సేవలను చూసి ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజరుద్దీన్, 108 మేనేజర్ ఆవులూరి దుర్గాప్రసాద్, గ్రామస్తులు అభినందించారు.

## గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం బలోపేతానికి కృషి చేయాలి



**ముదిగొండ జులై 11 (ప్రజాజ్యోతి )** నిబద్ధతతో ఎలాంటి అవినీతికి తావు ఇవ్వకుండా మండలంలో ఎంపీపీగా బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధిగా ప్రజలకు అనేక సేవలందించి, గొల్ల కురుమల అభివృద్ధి కోసం, గొర్రెలు మేక పెంపకం దారుల సంఘాన్ని బలోపేతం చేసిన వ్యక్తి పుచ్చకాయల వెంకటేశ్వర్లు.పుచ్చకాయ వెంకటేశ్వర్ల ఆశ సాధనకు అనుగుణంగా సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.సంఘం డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించుకునేందుకు గొల్ల కురుములు ప్రతి ఒక్కరు సంఘనికి అండాగా నిలవాలి ముదిగొండ మండలం రాఘవాపురం లో పుచ్చకాయల వెంకటేశ్వర్లు నివాసంలో ఏర్పాటు చేసిన గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం సమావేశం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన గొర్రెల పెంపకం దారుల సంఘం నాయకులు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడతా రవీందర్, రాష్ట్ర అధ్యక్షులు కీళ్ల గోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్ , రాష్ట్ర కమిటీ సభ్యులు జల్లెల్ల పెంటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




- శ్రీలంక ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న డాక్టర్ లక్ష్మి ఆకుల
- ఆర్టిజంతో బాధపడుతున్న పిల్లల కోసం 'బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్' ద్వారా అసాధారణ సేవలందిస్తున్న డాక్టర్ లక్ష్మి ఆకుల.
- తల్లిదండ్రుల్లో మనోధైర్యం నింపుతూ, పిల్లలను సాధారణ స్థితికి తెచ్చేందుకు
- ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు.
- దాతలు సహకరిస్తే అత్యాధునిక పరిజ్ఞానంతో గ్రామగ్రామానికీ బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్ సేవలను విస్తరిస్తామని వెల్లడి.

# ఆర్టిజం సేవల్లో అంతర్జాతీయ గుర్తింపు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

ఆర్టిజంపై సమాజంలో అవగాహన పెంచడమే లక్ష్యంగా ప్రత్యక్ష శిక్షణా సదస్సులు. అంతర్జాతీయ వేదికపై తెలుగు తేజం మానసిక వికాస లోపాలు, ముఖ్యంగా ఆర్టిజం బారిన పడిన చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రముఖ సామాజిక సేవా కర్త, థెరపిస్ట్ డాక్టర్ లక్ష్మి ఆకుల అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఆర్టిజం రంగంలో ఆమె చేస్తున్న నిరంతర కృషిని, నిరుపమాన సేవలను గుర్తిస్తూ శ్రీలంక ప్రభుత్వం ఆమెకు ప్రతిష్టాత్మక అవార్డును అందజేసింది. శ్రీలంకలో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో అక్కడి ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖుల చేతుల మీదుగా డాక్టర్ లక్ష్మి ఆకుల ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు ఆమె సేవా నిరతికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు మాత్రమే కాదు, తెలుగు రాష్ట్రాలకే గర్వకారణంగా నిలిచింది. మనోధైర్యాన్ని ఇస్తున్న

**'బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్'**

ఆర్టిజంతో బాధపడుతున్న పిల్లల తల్లిదండ్రులు అనుభవించే మానసిక వేదన అంతా ఇంతా కాదు. తమ పిల్లల భవిష్యత్తు ఏమిటా అని కుంగిపోయే అలాంటి తల్లిదండ్రులకు 'బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్' ఒక సంజీవనిలా మారింది. ఈ సంస్థ అధినేత డాక్టర్ లక్ష్మి ఆకుల కేవలం పిల్లలకు చికిత్స అందించడమే కాకుండా, వారి తల్లిదండ్రులలో కొండంత మనోధైర్యాన్ని నింపుతున్నారు. ఆర్టిజం అనేది నయం చేయలేని జబ్బు కాదు. సరైన





సమయంలో గుర్తిస్తే, ప్రత్యేక శిక్షణ ద్వారా ఆ పిల్లలు కూడా సమాజంలో అందరిలాగే సొంత కాళ్లపై నిలబడగలరు" అని డాక్టర్ లక్ష్మి ఆకుల భరోసా ఇస్తున్నారు.

**ఆర్టిజం అంటే ఏమిటి ఎవరికి వస్తుంది. ఎలా గుర్తించాలి.**

సమాజంలో ఆర్టిజం పట్ల ఇంకా పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం వల్ల చాలామంది పిల్లలు సకాలంలో సరైన శిక్షణకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ లక్ష్మి ఆకుల ఆధ్వర్యంలో బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్ నిరంతరం ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

**ఆర్టిజం అంటే ఏమిటి**

ఆర్టిజం లేదా ఆర్టిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది మెదడు ఎదుగుదలకు సంబంధించిన ఒక సంక్లిష్టమైన స్థితి. ఇది పిల్లల ప్రవర్తన, ఇతరులతో మాట్లాడే విధానం మరియు సామాజిక సంబంధాలపై ప్రభావం చూపుతుంది.

**ఏ వయసులో వస్తుంది ఎవరికి వస్తుంది**

ఇది సాధారణంగా పిల్లలు పుట్టినప్పటి నుంచే అంతర్గతంగా ఉంటుంది.



అయితే, 18 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు లోపు దీని లక్షణాలు స్పష్టంగా బయటపడతాయి. ఇది ఆడ, మగ అనే తేడా లేకుండా ఎవరికైనా రావచ్చు (అయితే పరిశోధనల ప్రకారం మగ పిల్లల్లో దీని ప్రభావం కొంచెం ఎక్కువగా కనిపిస్తుంది). దీనికి నిర్దిష్ట కారణాలు లేనప్పటికీ, జన్యుపరమైన మరియు పర్యావరణ మార్పులు కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు.

**అర్టిజం లక్షణాలు ఎలా గుర్తించాలి**

తల్లిదండ్రులు తమ పిల్లలలో క్రింది లక్షణాలను గమనిస్తే వెంటనే అలర్ట్ అవ్వాలి.

**ఐ కాంటాక్ట్ లేకపోవడం:** పిలిచినా పలకకపోవడం, కళ్లలోకి చూసి మాట్లాడకపోవడం.

**భాష సరిగ్గా రాకపోవడం:** వయస్సుకు తగ్గట్టుగా మాటలు రాకపోవడం, లేదా ఒకే మాటను పదే పదే అనడం .

**ఒంటరిగా ఉండటం:** తోటి పిల్లలతో కలవకుండా, తనలో తాను ఒంటరిగా ఆడుకోవడం.

**పునరావృత ప్రవర్తన:** చేతులు విదిల్చడం, ఒకే చోట గుండ్రంగా తిరగడం, వస్తువులను ఒకే వరుసలో అమర్చడం. అతిగా స్పందించడం లేదా అస్సలు స్పందించకపోవడం: శబ్దాలు, కాంతి లేదా తాకిడికి వింతగా ప్రవర్తించడం.

**బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్ ప్రత్యేక శిక్షణ – అత్యాధునిక విధానాలు**

డాక్టర్ లక్ష్మి ఆకుల నేతృత్వంలోని బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్ ఆర్టిజం పిల్లల కోసం సరికొత్త, శాస్త్రీయ శిక్షణా పద్ధతులను అవలంబిస్తోంది. కేవలం మందుల ద్వారా కాకుండా, థెరపీల ద్వారా పిల్లల్లో మార్పు తీసుకురావడమే వీరి ప్రత్యేకత.

**బిహేవియరల్ థెరపీ:** పిల్లల ప్రవర్తనలో మార్పులు తీసుకురావడం.

స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ మాట్లాడటం, ఇతరులతో కమ్యూనికేట్ చేయడం నేర్పించడం.

**ఆక్యుపేషనల్ థెరపీ:** రోజువారీ పనులు స్నానం చేయడం, బ్రష్ చేయడం, తినడం స్వయంగా చేసుకునేలా శిక్షణ ఇవ్వడం.

**సోషల్ స్కిల్స్ ట్రైనింగ్:** సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో నేర్పడం.

**లక్ష్యం:** ప్రతి గ్రామానికీ సేవలు – దాతలకు పిలుపు

ప్రస్తుతం పట్టణాలకే పరిమితమవుతున్న ఈ అత్యాధునిక కార్పొరేట్ స్థాయి థెరపీ సేవలను గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు కూడా అందుబాటులోకి తేవాలన్నదే డాక్టర్ లక్ష్మి ఆకుల ముఖ్య ఆశయం. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని ప్రభుత్వం, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్‌కు సహకరిస్తే, మేము అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన మెడికల్ పరికరాలను కొనుగోలు చేస్తాం. తద్వారా ప్రతి గ్రామ గ్రామానికి వెళ్లి, పేద ఆర్టిజం పిల్లలకు ఉచిత లేదా రాయితీపై అంతర్జాతీయ స్థాయి శిక్షణను అందిస్తాం. ఈ సేవ చేసే గొప్ప భాగ్యాన్ని, అవకాశాన్ని నాకు కల్పించాలని అందరినీ మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఆవేదనతో కూడిన అభ్యర్థన చేశారు.

**ముగింపు:** తల్లిదండ్రుల నవ్వే మా బహుమతి

ఆర్టిజం పిల్లల తల్లిదండ్రుల ముఖాల్లో సంతోషాన్ని చూడటమే బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్ యొక్క ఏకైక ప్రత్యేకత, లక్ష్యం. నిరాశలో ఉన్న ఎంతోమంది తల్లిదండ్రులకు ఆశల దీపంగా మారుతూ, అంతర్జాతీయ అవార్డులతో తెలుగు జాతి ఖ్యాతిని పెంచిన డాక్టర్ లక్ష్మి ఆకులను బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్ బృందాన్ని పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు.